ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 25 సెప్టెంబరు 2025

అన్నపూర్ణదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



అన్నపూర్ణదేవి అవతారంలో అమ్మవారు

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్న వరాత్రుల్లో భాగంగా మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు దుర్గామాత మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావ రిఖని చౌరస్తాలోని ఉజ్జాయిని మహంకాళి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వతంత్ర చౌక్‌లోని అమ్మవారి మండపంలో హోమం నిర్వహించారు.

ఆర్థికభరోసా దిశగా..

- దివ్యాంగులు, వృద్ధులు, బాలికలకు మనోధైర్యం
- స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటి వరకు 1350 సంఘాల ఏర్పాటు
- ఒకరికొకరు తోడుగా నిలవనున్న సంఘ సభ్యులు
- సంఘాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



స్వశక్తి సంఘాల మహిళల సమావేశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మహిళలను సంఘటితం చేసి వారిలో ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేసింది. అదే మాదిరిగా దివ్యాంగులు, వృద్ధులు, బాలికలతో కూడా సంఘాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారిలో మనో ధైర్యాన్ని కల్పించడంతోపాటు ఆర్థిక భరోసా కల్పించేందుకు దోహద పడుతుందని భావిస్తోంది. డీఆర్‌డీఓ అధికారులు సంఘాలు ఏర్పాటు చేయించి వారికి పొదుపు చేయడాన్ని అలవాటు చేయిస్తున్నారు.

గ్రామాలు, పట్టణాల్లో ఉండే వివిధ వర్గాల మహిళలను 1995 నుంచి ఒక్కటిగా చేసి 10 నుంచి 15 మంది సభ్యులను కలిపి ఒక డ్వాక్రా గ్రూపుగా ఏర్పాటు చేయించారు. వాళ్ల క్రమం తప్పకుండా రెండేళ్ల వరకు నెలనెలా పొదుపు చేయాల్సి ఉంటుంది. ఆ సంఘాలకు ప్రభుత్వం 10 వేల రూపాయల రివాల్వింగ్ ఫండ్‌ను అందజేసింది. ఆ డబ్బులు, పొదుపు చేస్తున్న డబ్బులతో మహిళలు స్వయం ఉపాధి పనులు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహించింది. ఈ పొదుపు విప్లవం అనేక మంది మహిళలను సంఘాలుగా ఏర్పాటయ్యేందుకు దోహదం చేసింది. ప్రతి గ్రామం, పట్టణంలో మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల సంఘాల పర్యవేక్షణ బాధ్యత సెర్ప్, పట్టణ ప్రాంతాల బాధ్యత మెప్మా చూస్తున్నది. జిల్లాలో ఇప్పటి వరకు 9,628 సంఘాలు ఉండగా, వీటిలో లక్ష మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పావలా వడ్డీ రుణాలు, జీరో వడ్డీ రుణులను అందిస్తున్నారు. శ్రీనిధి బ్యాంకు ద్వారా కూడా రుణాలను అందజేస్తున్నారు. సంఘం ఏర్పాటుకు 18 నుంచి 60 ఏళ్ల వయసు వాళ్లే ఉండాలనే నిబంధన ఉంది. 60 ఏళ్లు నిండిన వారందరినీ సంఘం నుంచి తొలగిస్తారు. ఆ తర్వాత ఆర్థిక భరోసా లేక చాలా మంది వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టు న్నారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వం మహి ళలను కోటీశ్వరులను చేసేందుకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టింది. మహిళలచే ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయించడం, పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు, మాల్స్, తదితర షాపులను ఏర్పాటు చేయిస్తున్నారు. అలాగే దివ్యాంగులు, వృద్ధులు, కిషోర బాలికలచే స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయించేం దుకు మహిళా శక్తి మిషన్ కార్యక్రమాన్ని తీసుకవ చ్చారు. ఆయా స్వశక్తి సంఘాల్లో లేని దివ్యాంగులు, వృద్ధులు, కిషోర బాలికలచే రెండు మాసాల నుంచి సెర్ప్ సిబ్బంది స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు కొత్త సంఘాలు 1350 ఏర్పాటయ్యాయని అధికారులు పేర్కొన్నారు. ఇందులో 2390 మంది సభ్యులతో 239 మహిళా సంఘాలు ఏర్పాటు కాగా, 2393 మంది సభ్యులతో దివ్యాంగులతో 319 సంఘాలను ఏర్పాటు

(మిగతా 8వ పేజీలో)

గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యం



బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

ధర్మారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన, లంబాడి తండాలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం మల్లాపూర్ నుంచి మ్యాకవెంకయ్యపల్లి వరకు 11.2కోట్ల రూపాయలతో నిర్మించే బైపాస్ రోడ్డును పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. గిరిజనశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత ముఖ్యమంత్రి సహకారంతో గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణానికి 740కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. గిరిజన, లంబాడీ తండాల్లో గిరిజన భవన్ నిర్మాణాలతోపాటు రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి 35కోట్ల నిధులు మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. గతంలో ట్రైబల్ వెల్ఫేర్ నుంచి మంజూరైన 12కోట్ల రూపాయలతో కీచులాటపల్లి, బుద్దేశ్‌పల్లె, దుబ్బాల గూడెం రోడ్డు పనులతో పురోగతి సాధించామని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, ధర్మపురి నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అజయ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సోగాల తిరుపతి, కాంగ్రెస్ నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, కొత్త నర్సింహులు, రామడుగు గంగారెడ్డి, గంధం మహిపాల్, స్వామి పాల్గొన్నారు.

విదేశీ విద్యానిధి ఆర్థిక సహాయానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి మండల రవీందర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ చదివిన, చివరి సంవత్సరం చదువుతున్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, జర్మనీ, జపాన్, సింగపూర్, సౌత్ కొరియా తదితర దేశాలకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థి పీజీ చదివేందుకు గ్రాడ్యుయేషన్‌లో 60శాతం కంటే ఎక్కువ మార్కులు ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం 5లక్షలలోపు, అలాగే టోఫెల్, జీఆర్ఈజీ మ్యాట్‌లలో అర్హతతోపాటు విదేశీవిద్యాలయంలో ప్రవేశంపొంది ఉండాలన్నారు. ఆసక్తిగల ఎస్సీ అభ్యర్థులు నవంబర్ 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహిళల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక రంగాల్లో పని చేస్తున్న శ్రామిక మహిళల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ శ్రామిక మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో జరిగిన జిల్లా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలు రంగాల్లో పని చేస్తున్న మహిళలు సామాజిక అణిచివేతకు గురవుతున్నారని, పని భద్రత లేకుండా పోయిందని, సమానపనికి సమానవేతనాన్ని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పని ప్రదేశాల్లో లైంగింక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, గ్రామపంచాయతీ, సింగరేణి సంస్థలో పని చేస్తున్న మహిళలను శ్రమదోపిడీకి గురి చేస్తున్నారని, కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం శ్రామిక హక్కులను హరించే విధంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. గృహహింస, అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, వనజారాణి, అమృత, పోషమ్మ, సుజాత, శారద, సులోచన, రేణుక పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం రైతుల ఆందోళన

- హైవే పనులు అడ్డుకున్న బాధిత రైతులు
- ఆర్డీవో ఆఫీసు వద్ద బాధితులతో మాట్లాడిన కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ మడత రమేష్



యంత్రాలను అడ్డుకుంటున్న రైతులు

మంథని/మంథనిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపాక గ్రామంలో భూములకు పరిహారం చెల్లించకుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు చేస్తుండగా బాధిత రైతులు బుధవారం అడ్డుకున్నారు. పరిహారం చెల్లించకుండానే వేసిన పత్తి పంటలను అధికారులు తొలగిస్తుండగా యంత్రాలకు అడ్డంగా రైతులు ఆందోళన చేపట్టారు. పరిహారం చెల్లించకుండా వేసిన పంటలను తొలగించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 5 నెలల క్రితం కలెక్టర్ పుట్టపాక గ్రామ పంచాయతీకి వచ్చి నిర్వాసిత రైతుల అకౌంట్ల డబ్బులు వేస్తామని మాట ఇచ్చారని బాధిత రైతులు వెల్లడించారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించకుండా పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. భూముల కోసం సంతకం చేసే వరకు ఒకరకంగా, తరువాత అధికారులు మమ్ముల్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించిన తరువాత పనులు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన వద్దకు వచ్చిన గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ రైతులతో మాట్లాడుతూ.. పరిహారం వచ్చే విధంగా సహకరిస్తామని వారికి నచ్చజెప్పారు. గ్రామానికి చెందిన ఇసంపల్లి రాధమ్మ అనే వృద్ధురాలి పేరు మీద ఉన్న 16 గుంటల భూమికి అధికారులు అవార్డు పాస్ చేయకుండా, నష్టపరిహారం ఇవ్వకుండా ఆమె భూమిలో పత్తి పంటను తొలిగించేందుకు సిద్ధపడగా ఆమె కుమారుడు చంద్రమూర్తి ఎక్స్‌కావేటర్‌కు అడ్డుగా పడుకున్నాడు. పోలీసులు చంద్రమూర్తిని, ఆయన భార్య సువర్ణ, తల్లి రాధమ్మతో పాటు ఇద్దరు పిల్లలను మంథని ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. అక్కడికి వచ్చిన కలెక్టర్ కోయ శ్రీహర్ష బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి



మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముంగిటకు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పట్టణ, మండలానికి చెందిన 96మంది లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళుతుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు ఉచిత కరెంటు, రెండులక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం 10లక్షలకు పెంపు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, సన్నవడ్లపై బోనస్, కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు, మానేరు నుండి ఇసుక పంపిణీ సులభతరం, లారీల్లో ఇసుక తరలింపు నిలిపివేసి భూగర్భజలాల పెంపునకు రైతులకు పరోక్ష సహాయం తదితర పనులను చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తాము బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే మరింత మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, పన్నాల రాములు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్, పడాల అజయ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వర్కర్లు జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

- ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

8

పండుగల నిర్వహణకు నిధులు ఇప్పించండి...

- ఎంపీవోకు వినతిపత్రం అందజేసిన కార్యదర్శులు

8

యువత సేవాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న అరుణశ్రీ, డి.కల్పన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం గోదావరిఖనిలోని పలు కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన వేడుకలకు జిల్లా అడిషనల్ కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి డి.కల్పన ముఖ్యఅతిథులుగా హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువత సేవా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. దేశ జనాభాలో 30శాతానికి పైగా యువత ఉందని, ఏది సాధించాలన్నా యువతతోనే సాధ్యపడుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దామరకొండ శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య, బాలికల కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. యూనివర్సిటీ పీజీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావదినోత్సవం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.ప్రసాద్ మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు క్రమశిక్షణ, సమాజశ్రేయస్సుకోసం పాల్పడాలని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించు కోవాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ రవి, డాక్టర్ సుధా, డాక్టర్ అంబిక, వలంటీర్లు పాల్గొ న్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య మాట్లాడారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ విద్యార్థులచే స్వచ్ఛప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో కోరే శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు కుక్కడపు శ్రీనివాస్, మంతెన శ్రీనివాస్, లైబ్రేరియన్ శంకరయ్య, రాజిరెడ్డి, జీడీకనకయ్య, శ్రీగోదా, శంకరయ్య, జగదీశ్వరి, శారద, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

మంథని/రామగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జ్వరాల బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంథని, రామగిరి మండలాల్లో బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి జేబీఎస్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ బాలికలస్కూల్, గురుకులు పాఠశాలను పరిశీలించారు. జెబిఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, కిచెన్‌షెడ్ నిర్మాణ పనులు, బాలికల జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, టైల్స్, అదనపు తరగతి గది నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. రామగిరి మండలంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, బేగంపేట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. రత్నాపూర్ అప్పర్‌ప్రైమరీ స్కూల్‌లో డీఎంఎఫ్‌టి నిధులు రూ. 9లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులు ప్రారంభించాలన్నారు. అండర్‌గ్రౌండ్ లెవెలింగ్‌లో చేయాలన్నారు. బేగంపేట్‌లోని పాఠశాలలో డయాస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంథని ఆసుపత్రికి వచ్చే ఫీవర్ కేసులకు మెరుగైన వైద్యం సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల లక్షణాలు గల వారికి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఓపి సేవలను పెంచాలని, వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండాలన్నారు. మంథని ఆసుపత్రి సూపరిండెంట్ రాజశేఖర్, ఏఈ పీఆర్ అనుదీప్, ఏఈ వరలక్ష్మి, సంబంధింత అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై హత్యాయత్నం కేసులో పురోగతి

● పోలీసుల అదుపులో నిందితుడు

కోల్‌సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన పరంకుశం యశ్వంత్(36)పై జరిగిన హత్యాయత్నం కేసు కొలిక్కి వచ్చింది. తొమ్మిది నెలలుగా పోలీసులు ఈ కేసును చేధించేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. గోదావరిఖని కోదండరామాలయ సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్, ఫిజీషియన్ అసిస్టెంట్ అయిన యశ్వంత్‌పై జనవరి 7న హత్యాయత్నం జరిగింది. ఇంటి వెనుక నుంచి ఇంట్లోకి చొరబడిన దొంగలు కత్తులతో అతని తల, ముఖంపై దాడి చేశారు. ఆ సమయంలో యశ్వంత్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఆయన భార్య ప్రతిమ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. యశ్వంత్ హత్యాయత్నం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. దాడికి పాల్పడిన నిందితులు ఇంట్లోని ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లలేదు. వేలి ముద్రలు పడకుండా జాగ్రత్తపడ్డారు. గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, క్రైం టీమ్ వివిధ కోణాల్లో విచారణ జరిపారు. ఒక సమయంలో కాల్‌డాటాను విశ్లేషించిన పోలీసులు కుటుంబ సభ్యులు, బంధువులను విచారించారు. యశ్వంత్ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో నిందితుడి ముఖం రికార్డు కావడంతో దాని ఆధారంగా విచారణ చేపట్టారు. ఎట్టకేలకు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా మరికొందరిని విచారిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

శంషాబాద్ గ్రామంలో గంజాయి కలకలం

మానకొండూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని శంషాబాద్ గ్రామంలో బుధవారం గంజాయి దొరికిందన్న విషయం కలకలం రేపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్ నుంచి మంగళవారం వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా అర్ధరాత్రి బ్యాగుతో రోడ్డు వెంబడి అనుమానాస్పదంగా వెళుతున్నాడు. గమనించిన కొందరు అతన్ని ప్రశ్నించగా బ్యాగును వదిలిపెట్టి పరారయ్యాడు. బ్యాగును పరిశీలించగా అందులో సుమారు 20గంజాయి ప్యాకెట్లు, ఫొటోలు, ఆధార్‌కార్డు, పర్సు ఇతర సామాను ఉన్నాయి. బుధవారం గ్రామంలో గంజాయి లభించిందన్న సమాచారం గుప్పుమనడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లభ్యమైన బ్యాగును పరిశీలించి గంజాయితో పాటు బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై సీఐ సంజీవ్‌ను సంప్రదించగా సంఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు.

హుజూరాబాద్‌లో కారు దగ్ధం

హుజూరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ప్రమాదవశాత్తు కారు దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్న కొమురవెల్లి సంతోష్ తన కారును మంగళవారం సాయంత్రం సర్వీసింగ్ చేయించి ఇంటిముందు పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం గుడికి వెళ్దామని కారును స్టార్ట్ చేయగా, ఒక్కసారిగా ఇంజన్ నుంచి పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. వెంటనే సంతోష్ కారులో నుంచి బయటకు వచ్చి మంటలను ఆర్పడానికి ప్రయత్నించాడు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ తోనే మంటలు వ్యాపించాయని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా నిర్ధారించారు. సుమారు రూ.6లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి రాజశేఖర్(34) ఈనెల 21న చుట్టపు చూపుగా పత్తిపాక గ్రామానికి చెందిన మోదుంపల్లి అంజయ్య ఇంటికి వచ్చాడు. రాజశేఖర్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. అయితే పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపంతో ఉండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రాజశేఖర్ పత్తిపాక చెరువుకట్టపై గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అంజయ్యకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. రాజశేఖర్ తల్లి దాసరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కడసారి చూపు కోసం ఎదురుచూపు



● సత్యనారాయణరెడ్డి(కోసా) మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
● సోదరుడికి మృతదేహం అప్పగించిన పోలీసులు
● ఛత్తీస్‌గఢ్ నుంచి బయలుదేరిన కుటుంబ సభ్యులు
● నేడు స్వగ్రామం గోపాల్‌రావుపల్లిలో అంత్యక్రియలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అబూజ్‌మడ్‌లో ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా అలియాస్ గోపన్న అలియాస్ సాధు కడసారి చూపు కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్థులు, మిత్రులు ఎదురుచూస్తున్నారు. సత్యనారాయణరెడ్డి మృతదేహం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో



కోసా మృతదేహంతో అంబులెన్స్ వద్ద కరుణాకర్‌రెడ్డి

భద్రపరిచారు. మృతదేహాన్ని చూసి అన్న కరుణాకర్‌రెడ్డి కన్నీటి పర్యంతం అయ్యారు. తమ్ముడి మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు గోపాల్‌రావుపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. వీరు మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు వరకు నారాయణ్‌పూర్ చేరుకున్నారు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు గుర్తుపట్టి సత్యనారాయణరెడ్డిదేనని తేల్చి సంతకం చేశాక బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పోస్టుమార్టం పూర్తయింది. తర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు నారాయణ్‌పూర్‌లో అంబులెన్స్ అద్దెకు తీసుకునే వరకు ఆలస్యం అయ్యింది.

ఛత్తీస్‌గఢ్ నుంచి 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోసా స్వగ్రామానికి అంబులెన్స్ అద్దెకు ఇవ్వడం ఎవరు ముందుకు రాలేదు. చివరికి మృతదేహాన్ని నారాయణ్‌పూర్ జిల్లా ఆసుపత్రి నుంచి తీసుకొని కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి 8 గంటలకు బయలుదేరారు. అంబులెన్స్ సిరిసిల్లకు చేరడానికి దాదాపు 10 గంటలు పడుతుంది. గురువారం ఉదయం వరకు కోసా మృతదేహం స్వగ్రామమైన గోపాల్‌రావుపల్లి చేరనుంది. విప్లవబాట పట్టిన నుంచి 45 సంవత్సరాల తర్వాత శవమై స్వగ్రామమైన గోపాల్‌రావుపల్లికి వస్తుండంతో కడసారి చూపు కోసం ఎదురు చూస్తున్నారు. ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. మృతదేహం తీసుకురావడం ఆలస్యం కావడంతో గోపాల్‌రావుపల్లిలో గురువారం ఉదయం అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు.

గట్టు వామన్‌రావు ఇంటికి సీబీఐ అధికారులు

మంథనిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామంలోని గట్టు వామన్‌రావు ఇంటికి సీబీఐ అధికారుల బృందం బుధవారం మరోసారి వచ్చినట్లు తెలిసింది.. కుటుంబ సభ్యులను కలిసిన అధికారుల బృందం కేసుకుసంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించినట్లు సమాచారం. హత్యకు గురైన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణిల కేసువిచారణ కోసం వామన్‌రావు తండ్రి కిషన్ రావును, కుటుంబ సభ్యులను ఈనెల18న సీబీఐఅధికారుల బృందం గుంజపడుగులో వారి ఇంట్లో కలిశారు. కేసు దర్యాప్తులో భాగంగా మరోసారి సీబీఐ అధికారుల బృందం వామన్‌రావు కుటుంబ సభ్యులను కలిసినట్లు తెలుస్తోంది.

రూ.6050 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌యార్డులో క్వింటాల్ పత్తి ధర రూ.6050 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 18మంది రైతులు 98క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 22క్వింటాళ్ల గోనెసంచుల్లో కొత్త పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.6050, కనిష్ఠ ధర రూ.4500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

అడవిని నరికివేశాడని చనిపోయిన వ్యక్తిపై కేసు

● నేడు కోర్టుకు హాజరు కావాలని కుటుంబ సభ్యులకు సమన్లు
● ఫారెస్ట్ అధికారుల వింత వ్యవహారం

కథలాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం రాజారాం తండాకు చెందిన భూక్యా కీమ్యానాయక్ నాలుగేళ్లక్రితం మృతి చెందగా అడవిని నరికివేశాడని పోలీసులు రెండేళ్లక్రితం కేసు నమోదు చేశారు. భూక్యా కీమ్యానాయక్ 2020ఆగస్టు 31న అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. అయితే ఫారెస్ట్ అధికారులు కీమ్యానాయక్ గ్రామ సమీపంలోని అడవిని నరికివేసి భూమి చదును చేశాడని ఈనెల 25న కోర్టుకు హాజరు కావాలని కుటుంబ సభ్యులకు సమన్లు పంపడంతో ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన పదిమంది అడవిలోకి అక్రమంగా ప్రవేశించి అటవీ భూములను చదును చేశారంటూ ఓ ఫారెస్ట్ అధికారి రెండేళ్ల కిందట కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎలాంటి విచారణ చేయకుండానే హడావుడిగా సదరు అధికారి కేసులు నమోదు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

దొరిగిన బంగారం పోలీసులకు అప్పగింత

● మానవత్వాన్ని చాటిన భార్యాభర్తలు

హుజూరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ భార్యభర్తలు 13తులాల బంగారం దొరికిందని పోలీస్‌స్టేషన్లో అప్పగించి మానవత్వాన్ని చాటిచెప్పిన సంఘటన హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన రమేష్ మూడురోజుల క్రితం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామం నుంచి 13 తులాల బంగారు నగలను బ్యాగ్‌లో పెట్టుకొని హుజూరాబాద్‌కు వస్తున్నాడు. మార్గమధ్యలో ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామ శివారులో ఆ బ్యాగ్ బైక్‌వెనుక నుంచి జారీ కింద పడిపోయింది.

బంగారాన్ని పోగొట్టుకున్న రమేష్ ఆందోళనతో హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సమ్మయ్య, నవీజ దంపతులకు ఆ బ్యాగ్ దొరికింది. బ్యాగ్‌ను చూసిన వారు విలువైన వస్తువులు ఉన్నాయని గ్రహించి వెంటనే పోలీసులకు అప్పగించారు. పోలీసులు రమేష్‌ను పిలిపించి టౌన్‌సీఐ కరుణాకర్ సమక్షంలో 13తులాల బంగారు నగలను తిరిగి అప్పగించారు. నిజాయితీగా దొరికిన బంగారాన్ని పోలీస్ స్టేషన్లో అప్పగించిన సమ్మయ్య, నవీజ దంపతులను టౌన్ సీఐ కరుణాకర్ సన్మానించి, అభినందించారు.



బంగారం ఇచ్చిన దంపతులను సన్మానిస్తున్న సీఐ కరుణాకర్

గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

● 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. ● 20 లీటర్ల సారా స్వాధీనం ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుడుంబా స్థావరాలపై అబ్కారీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మారుమూల గిరిజన పల్లెల్లో తయారీ, రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21న 'గుట్టుగా గుడుంబా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎక్సైజ్ అధికారులు బుధవారం ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని వీర్నపల్లి మండలం మద్దిమల్ల, లొద్ది తండా, గోల్యానాయక్‌తండా, బావుసింగ్‌తండా, బంజారుతండా, భూక్యతండా, రాశిగుట్టతండాలపై సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకేంద్రాలను కనుగొన్నారు. వ్యవసాయ పొలాలు, ఇళ్ల సమీపంలో నిల్వ చేసిన 250లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 20లీటర్ల నాటు సారాను స్వాధీన పర్చుకున్నారు. గుడుంబా తయారీ, రవాణా, అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. తమకు సమాచారం అందించిన వారివివరాలను గోప్యంగా ఉంచు తామని, సారా నియంత్రణకు పాటుపడాలని కోరారు. దాడుల్లో సిబ్బంది రాకేశ్, వర్మ, రాజు, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

మర్రిగడ్డలో ఒకరి ఇంట్లో చోరీ

చందుర్తి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మరిగడ్డ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఒకరి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని మర్రిగడ్డ గ్రామానికి చెందిన బైరగోని అనిత మంగళవారం రాత్రి 11 గంటల వరకు టీవీ చూస్తూ నిద్రపోయింది. తెల్లవారుజామున 5 గంటలకు భర్త తలుపులు తెరిచి పొలం పనులకు వెళ్లాడు. నిద్ర నుంచి మేల్కొన్న అనిత చూసేసరికి బంగారు పుస్తెలతాడుతో పాటు సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేసీఆర్ నగర్ కాలనీ సమీపంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పింది. ఈ సంఘటనలో మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు నర్సింలు, హరికృష్ణలు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నర్సింలు, హరికృష్ణలు తమ బైక్‌పై వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్త గ్రామానికి చెందిన దొంతుల శ్రీనివాస్ తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు కన్నాపూర్‌కు వచ్చి తిరిగి మక్తకు వెళ్తుండగా స్కూల్‌వద్ద మోటర్ సైకిల్ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కావడంతోపాటు ఎడమచేతి వేళ్ల విరిగి రోడ్డు మీదపడ్డాయి. గమనించిన స్థానికులువెంటనే 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

27న ద్విచక్ర వాహనాల స్క్రాప్ బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న యజమానులు తెలియని 57 ద్విచక్రవాహనాలకు ఈనెల27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. 27న మధ్యాహ్నం 2:30గంటలకు సీటీసీలో వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం వేసే వాహనాలను 27వ తేదీన ఉదయం 11 గంటల నుంచి పరిశీలించవచ్చని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు తప్పనిసరిగా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును సమర్పించాలన్నారు. వేలంపాటలో విజేతగా నిలిచినవారు, తాము కొనుగోలు చేసిన వాహనాలకు పూర్తి మొత్తంతో వేలం నిర్వహణ సంస్థ కమిషనర్‌కు అక్కడికక్కడే నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. కొనుగోలుదారులు పోలీస్ అధికారుల సూచనల మేరకు వాహనాలను కట్ చేసి, తమ సొంత ఖర్చులతో తరలించుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గన్నేరువరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలోని మోయతుమ్మెద వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఒకరి అదృశ్యం

కథలాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌కు చెందిన నేతి కుంట రాజరెడ్డి(58) అనేవ్యక్తి అదృశ్యమయ్యాడు. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన రాజరెడ్డి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రాజరెడ్డి(ఫైల్)

గుంతలమయంగా హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్

● ఇబ్బందులు పడుతున్నడ్రైవర్లు.. ప్రయాణికులు



బస్టాండ్‌లోని రోడ్డుపై ఏర్పడిన గుంత, పగుళ్లు బారిన సీసీ రోడ్డు

హుజూరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని రోడ్డంతా గుంతలమయంగా అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్ బస్టాండ్ నుంచి నిత్యం ప్రజలు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హుస్నాబాద్, నిజామాబాద్, తిరుపతి, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో వర్షం పడితే నీళ్లుపోయే దారిలేక బస్టాండ్ ఆవరణలోనే నిలిచిపోతున్నాయి. దీంతో బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే దారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. గుంతల్లో నుంచి బస్సులు వెళ్తుండడంతో బస్సుల కమన్ పట్టీలు విరుగుతున్నాయని డ్రైవర్లు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా గుంతలు పడిఉన్నా ఆర్టీసీ అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దీనిపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలోని గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎండపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కొద్దిరోజుల క్రితం గాయపడిన ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పొన్నం రవిగౌడ్(55) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మూడురోజుల క్రితం రవిగౌడ్ కల్లు గీసుకొని గుళ్లకోట శివారులో తన ద్విచక్రవాహనంపై వస్తుండగా వెల్గటూర్ మండలం శాఖాపూర్‌గ్రామానికి చెందిన పికప్‌వాహనం ఢీకొట్టింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సచేస్తుండగా మరణించాడు. మృతుడికిభార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయంచేయాలని గ్రామస్థులు, కుటుంబసభ్యులు రాజారాంపల్లి చౌరస్తావద్ద మృతదేహంతో బుధవారం ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

నేడు ఇసుక వేలం

గంగాధర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇసుక వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రజిత తెలిపారు. బుధవారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. మండలంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను గురువారం వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆమె తెలిపారు.

అడవిలో చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుంటాం

రుద్రంగి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానాల అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్ అధికారి ముకుందరెడ్డి అన్నారు. రుద్రంగి మండలం మానాల గ్రామంలో భారీసంఖ్యలో నీలగిరి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వారంరోజులుగా గ్రామస్థులు చేస్తున్న నిరసనలకు బుధవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారి ముకుందరెడ్డి, ఫారెస్ట్ అధికారులతో కలిసి ధ్వంసమైన చెట్లను పరిశీలించారు. మానాల గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారెస్ట్ భూముల్లో ఎవరైనా చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా వేసిన బోరుబావుల్లోని విద్యుత్ మోటర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. భూములు చదును చేయడానికి సహకరించిన ఫారెస్ట్ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



మానాల గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు

కొడిమ్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇస్లాంపురకు చెందిన లక్ష్మి అనే మహిళకు చెందిన ఇంటి తాళం పగులగొట్టి 2025లో దొంగతనం చేసిన నిందితుడు రేగుల అజయ్‌కుమార్‌కు సెకండ్ అడిషనల్ జ్యుడిషీయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.లావణ్య ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇస్లాంపుర గ్రామానికి చెందిన లక్ష్మి పని నిమిత్తం ఇంటికి తాళం వేసి గత మార్చి 28న కరీంనగర్‌కు వెళ్లగా నిందితుడు ఇంటిలోని బంగారం, నగదు ఎత్తుకపోయారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. నిందితుడు అజయ్‌కుమార్‌ను కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆవులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● రుద్రంగిలో యువకుల ధర్నా

రుద్రంగి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆవులను అక్రమంగా సరఫరా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నంద్యాడపు వెంకటేష్ డిమాండ్ చేశారు. రుద్రంగి మండల కేంద్రంలో రాత్రి ట్రాలీ ఆటోలో రెండు గోవులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న భవాని దీక్షాపరులు, గోసంరక్షణ టీం సభ్యులు కలిసి ఆవులను తరలిస్తున్న ఆటోను అడ్డుకున్నారు. అయితే గోవులను తరలిస్తున్న వ్యక్తిని, తరలిస్తున్న ఆటోను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయాలని మండలకేంద్రం శివారులోని గండి వేంకటేశ్వర్లస్వామి ఆలయ సమీపంలో యువకులు ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చెరుకొని ఆటోను సీజ్ చేయడంతో పాటు, ఆవులను తరలిస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేస్తామనడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమలో భవాని దీక్షదారులు, యువకులు పాల్గొన్నారు.



రుద్రంగిలో ధర్నా చేస్తున్న భవాని దీక్షాపరులు


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కూరగాయలు

కూరగాయల సాగు బహుబాగు


చిక్కుడు పంట

అధిక దిగుబడి సాధిస్తున్న రైతు

కథలాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన దాసరి గంగాధర్ అనే రైతు కూరగాయలు సాగు చేస్తూ రోజూ రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాడు. గంగాధర్ తనకున్న మూడెకరాల భూమిలో సీజన్‌కు అనుగుణంగా పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. కాకర, చిక్కుడు, టమాట, వంకాయ, బీర వంటి కూరగాయలను సాగు చేయడానికి సుమారు రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టాడు. మండలంలో ప్రతీ దినం ఎక్కడో ఓ గ్రామంలో జరిగే అంగడికి కూరగాయలు తీసుకెళ్లి విక్రయిస్తూ ఖర్చులు పోను రోజు రూ.10 వేలు సంపాదిస్తున్నాడు. గంగాధర్ గతంలో మాజీ సర్పంచ్‌గా పనిచేయగా ప్రస్తుతం సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్నాడు.

బంతిపూల సాగుతో అదనపు ఆదాయం

పసుపు, లేత గులాబీ రంగులో ఉన్న బంతి పూల పంటను సైతం సాగు చేస్తూ అదనపు ఆదాయం సమకూర్చుకోవడం విశేషం. దసరా, దీపావళి, బతుకమ్మ పండుగలకు బంతిపూలకు డిమాండ్ అధికంగా ఉండడంతో లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఏర్పడింది.

కూరగాయల సాగుతో ఆదాయం
దాసరి గంగాధర్, రైతు

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. మూడెకరాల విస్తీర్ణంలో బీర, కాకర, చిక్కుడు, టమాట వంటి కూరగాయలతో పాటు బంతి పూల పంటను సాగు చేస్తున్నాను. కూలీలు, ఇతరత్రా ఖర్చులు పోను ప్రతీ రోజు దాదాపు రూ.10 వేలు సంపాదిస్తున్నాను. మండలంలో చుట్టు పక్కల ఉన్న అంగళ్లకు వాహనంలో కూరగాయలు తీసుకుకెళ్లి అమ్ముకుని ఉపాధి పొందుతున్నా.



చంద్రఘంట అలంకారంలో అమ్మవారు

ఘనంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవినరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో మూడవ రోజు స్వామి వారికి విశిష్ట పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి స్వామికి అధర్వశీర్ష పఠనంతో అభిషేకం, రాజరాజేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వర అమ్మవారికి మహాభిషేకం, షష్టి ఉపచార పూజలు, గాయత్రి హోమంతో పాటు పరివార దేవతల ఆరాధన, పారాయాణాలు, దేవీ భాగవత పురాణ ప్రవచనాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వాహన సేవతో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

ధర్మపురిలో



ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవ రాత్రోత్సవాలు మూడవ రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు అమ్మవారు చంద్రఘంటాదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. టీటీడీ కళ్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహా శక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో, నేరెళ్లలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్ పాల్గొన్నారు.

కొండగట్టులో అన్నపూర్ణాదేవిగా..

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన స్వామి వారు


అశ్వవాహనంపై కొలువుదీరిన శ్రీస్వామి వారు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజు శ్రీదేవినవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం శ్రీస్వామి వారి ఉత్సవమూర్తుల పెద్దసేవతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, వాతవరణంలో మార్పు కారణంగా అశ్వవాహనంపై ఉత్సవమూర్తులను నిలిపి అంతరాలయంలో పెద్దసేవ నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలో పాల్గొని పెద్ద సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈవో రమాదేవి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ బీజేపీ సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్ నుంచి 3,35,160 క్యూసెక్కులు నీరు విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 40 గేట్లు పైకి ఎత్తి 3,35,160 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 62.673 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు బుధవారం 8000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు 4గేట్ల ద్వారా 9000 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.84 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.14టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతల నిలిపివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలను నిలిపివేశారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.29టీఎంసీలకు నీరు చేరుకుంది. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు నీటి ఎత్తిపోతలు నిలిపివేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

ఎల్‌ఎండీలోకి తగ్గుతున్న ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి 24వేల క్యూసెక్కుల నీటిని ఎల్‌ఎండీ స్పిల్‌వే గేట్ల నుంది దిగువకు విడుదల చేస్తున్న అధికారులు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో బుధవారం మధ్నాహ్నం 1.30 గంటలకు 16వేల క్యూసెక్కులకు తగ్గించారు. ఎల్‌ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.732 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 7520 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 9వేల క్యూ సెక్కులు, ఎగువకాకతీయ కాలువ నుంచి 4వందల క్యూసెక్కులు మొత్తం 16,920 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తున్నాయి. ఎల్‌ఎండీ 8గేట్ల నుంచి 16వేలు, కాకతీయ కాలువ నుంచి 3వేల క్యూ సెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు మొత్తం 19,309 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి సీతక్క

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళాలు ఆర్థికంగా ఎద గాలని మహిళా సంక్షేమం, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని ఎల్‌ఎండి కాలనీలో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో పలు అంశాల్లో శిక్షణ పొందిన మహిళాలకు ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అనేక మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అదే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళాలను మహిళా సంఘాల్లో చేర్పించి వారిని కోటీశ్వరులుగా చేయండి అని ఆదేశించారన్నారు.

తాము అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి మహిళలకు 27 వేల కోట్ల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో 10 మహిళా ప్రాంగణాలు ఉన్నాయని, వాటిలో మహిళలకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో 10 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. నారాయణపేట జిల్లాలో 11 మంది సభ్యులున్న మహిళా సంఘానికి పెంట్రోల్ బంక్ ఇచ్చామని, వారు ఆరునెలల్లో అన్ని ఖర్చులు పోను 13.8 లక్షల రూపాయలు సంపాదించారని తెలిపారు. మహిళలందరు మహిళా సంఘాలలో చేరాలని పిలుపునిచ్చారు.


ఎల్‌ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్
మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ-ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు రవాణా శాఖ నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ స్ఫూర్తితో హైదారాబాద్‌లోనూ మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించి లైసెన్సులు ఇస్తామన్నారు. మహిళా ప్రాంగణానికి అదనపు ఆదాయ వనరులు సమకూర్చేందుకు వీలుగా పెట్రోల్ బంక్ నెకొల్పే యోచన ఉందన్నారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చుతుందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాడ్డాక మహిళలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆర్టీసీలో మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేశామని, ఉమ్మడి జిల్లాలో 47 బస్సులు మహిళా సంఘాల ద్వారా అద్దెకు నడుస్తున్నాయన్నారు. వాటి ద్వారా మహిళా సంఘాలు నెలకు 70 వేల వరకు ఆదాయం పొందుతున్నాయని తెలిపారు. మహిళలంతా ప్రభుత్వపరంగా ఆర్థిక ప్రయోజనం పొందాలంటే తప్పకుండా మహిళా సంఘాల్లో చేరాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.



- మహిళలు అన్ని రంగాల్లోనూ ముదుండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన మహిళలను కేంద్ర మంత్రి బండి సంజయ్ తొమ్మిది ఆటోలను, తాను రెండు ఆటోలను సమకూర్చామని తెలిపారు. ఈ ఆటోలకు మా అక్క ఆటో అని కలెక్టర్ పమేలా సత్పతి పేరు పెట్టారని తెలిపారు.



- తెలంగాణను జీరో క్రైంగా స్టేట్‌గా మార్చేందుకు కృషి చేయాలని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి మాట్లాడుతూ మహిళా ప్రాంగణాల్లో విభిన్న రంగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. జిల్లా యంత్రాంగం అందిస్తున్న వివిధ శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. మహిళలతో మంత్రి సీతక్క, నేరెళ్ల శారద, బండ్రు శోభరాణి, కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు, మహిళా సంఘాల సభ్యులతో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది పెండింగ్ బిల్లులు చెల్లించాలి
మంత్రులు పొన్నం, సీతక్కకు
పోలీస్ సంఘం వినతి


మంత్రులు సీతక్క, పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది పెండింగ్ బిల్లులు పండుగకు ముందే చెల్లించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కరీంనగర్ జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు, ఎస్‌ఐ మామిడాల సురేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లో బుధవారం మంత్రులకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ఇతర ప్రభుత్వ శాఖలకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించినప్పటికీ, కరీంనగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి మాత్రం ఇంతవరకు పెండింగ్ బిల్లులు అందలేదని కరీంనగర్ జిల్లా పోలీస్ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. జనవరి 2024 నుంచి రావలసిన సరెండర్స్, అడిషనల్ సరెండర్స్, 6 నెలల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలు, 2018 పీఆర్‌సీ బకాయిలు, ఇతర జిల్లాలకు చెల్లించినప్పటికీ కరీంనగర్ జిలాకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వినతిపత్రంలో ప్రస్తావించారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకుని బకాయిలు వెంటనే మంజూరు చేయాలని పోలీస్ సంఘం కోరింది.

భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

కరీంనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామస్థాయిలో ప్రజలకు, రైతులకు మేలు జరగాలనే ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి గ్రామ పాలన అధికారులకు సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలందించి భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెవెన్యూ గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో గ్రామపాలన అధికారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూభారతి చట్టం, విధులు, బాధ్యతలతోపాటు పారదర్శకత, అంకితభావం తో కూడిన పౌరసేవలపై దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ రైతాంగానికి, ప్రజలకు మెరుగైన సేవలను క్షేత్ర స్థాయిలోనే అందించాలనే సంకల్పంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం, పునర్నిర్మాణంలో భాగంగా సీఎం రేవంద్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో జీపీవో వ్యవస్థ ఏర్పాటు సాధ్యమైందని అన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

గతంలో ఐదువేల మంది ఉంటే నేడు 10వేల పైచిలుకు రెవెన్యూ ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకోవడం జరిగిం దని చెప్పారు. జీపీవోలు ఏ ఒక్కరు తప్పుచేసినా అది మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి త్వర లోనే తీపి కబురు వస్తుందని చెప్పారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి సారధ్యంలో గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా మని టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అన్నారు. టీజీటీఏ జనరల్ సెక్రెటరీ రమేశ్ పాక మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు యువత ఎంత కీలకమో, రెవెన్యూ వ్యవస్థకు జీపీవోలు అంతే కీలకమని అన్నారు. కార్యక్రమంలో టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకులు వి.బిక్షం, చిల్లా శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, రమేశ్, టీజీటీఏ నగర కార్యదర్శి రాజేశ్వరి, నవాజ్ షరీఫ్, రిటైర్డు తహసీల్దార్ గంప శంకరయ్య, మల్లారం అర్జున్, ఆంజనేయప్రసాద్, సాయి కిషోర్, బాపుదేవ్ పాల్గొన్నారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి


పిల్లలను దత్తత ఇస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్/ కరీం నగర్ క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటే ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తవని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిశు గృహంలో పెరుగుతున్న ఆరు నెలల వయసున్న ఇద్దరు శిశువులను విశాఖపట్నం, మేడ్చల్ మల్కాజ్‌గిరికి చెందిన పిల్లలు లేని దంపతులకు కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీ కుల నుంచి దత్తత తీసుకోవా లనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, ఎల్‌సీపీవో తాటిపల్లి రాజు, రాజ్ కుమార్, సాదినేని రమేశ్ పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం బైక్ యాత్ర


బైక్‌పై ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం సూర్యాపేట, మద్దిరాల మండలం గోరంట్ల గ్రామ జీడీపీ హెచ్‌ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాచకొండ ప్రభాకర్ బైక్‌యాత్ర చేపట్టారు. యాత్రను సోమవారం సూర్యాపేట ఎస్పీ ప్రారంభించగా ప్రభాకర్ ఉమ్మడి 10 జిల్లాల్లో దసరా సెలవులంతా యాత్ర చేయనున్నారు. బుధవారం తెలంగాణ చౌక్ వద్ద ఆయన ఆగి పాదచారులు, వాహనదారులకు గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కోసమే యాత్ర చేస్తున్నాని, తన యాత్రతో కొంతైనా మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయానికి దాతల విరాళాలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి పలువురు వ్యక్తులు బుధవారం విరాళాలు అందించా రు. జగిత్యాల జిల్లా బ్రాహ్మణవాడకు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి లక్షా 116 రూపాయల చెక్కును ఆలయాధికారులుకు అందించారు. రాజన్న ఆలయ గోశాలకు హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన ప్రణమ్య ఎలక్ట్రికల్‌కు చెందిన సుమన్‌శర్మ అనే వ్యక్తి 10 పెద్ద విద్యుత్ వీధి దీపాలను ఈవో రమాదేవికి అందించారు.

టెట్ సమస్యను పరిష్కరించాలని వినతి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టెట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి టెట్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంత రావు, నవాత్ సురేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, తిరుపతి, రాష్ట్ర కార్యదర్శులు వెంకటరమణ, సుభాషి భాస్కర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్, తిరుపతిరావు, సునీల్ రెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో కీలకం



నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మసిస్టులు ఆరోగ్య సరంక్షణ, రోగి శ్రేయస్సులో సమగ్ర పాత్ర పోషి స్తారు. ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులు పోషించే పాత్రను గుర్తించి వారిని అభినందించేందుకు అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని 2009 నుంచి నిర్వహిస్తున్నది. ఫార్మసిస్టులు ఎప్పటి నుంచే మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో భాగమయ్యారు. వారు కౌంటర్ వెనక నిశ్శబ్దంగా పనిచేసే హీరో లు. కాని వారి ప్రభావం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో కీలకంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరిని గౌరవిస్తూ ఫార్మ సిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్మసిస్టులు మందులను సురక్షితంగా వినియోగించడంపై రోగులకు అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య సరంక్షణ, పర్యావరణ వ్యవస్థలో సహకారాన్ని ప్రోత్సహిస్తుంది.

ఉద్యోగమే కాదు పవిత్రమైన బాధ్యత...
టి రామారావు, ఫార్మాసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

ఫార్మాసిస్టు అనేది ఉద్యోగమే కాదు పవిత్రమైన బాధ్యత. వైద్యుడి సూచనను శాస్త్రీయంగా అమలు చేసే బాధ్యత ఉన్న వ్యక్తి ఫార్మాసిస్టు. ఫార్మసిస్టులు కూడా విధినిర్వహణకు సంబంధించిన సమ స్యలతో బాధపడుతున్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.



ఆర్థికభరోసా దిశగా...

(5వ పేజీ తరువాయి)

చేశారు. 4,950 మంది సభ్యులతో 495 వయోవృద్ధుల సంఘాలు, 2970 మంది బాలికలతో 297 కిషోర బాలికల సంఘాలను ఏర్పాటయ్యాయి. ఈ సంఘాల్లోని సభ్యులకు పౌష్టికా హారం గురించి, తల్లిదండ్రులు, గురువులు ఎలా ఉండాలి, నైతిక విలువలు, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంఘాల్లోని సభ్యులు నెలకు 100 రూపాయల చొప్పున పొదుపు చేస్తుండగా, ఆరు నెలల తర్వాత వారికి రివాల్వింగ్ ఫండ్ అందనున్నది. ఈ విషయమై డీఆర్‌డీవో కాళిందిని ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధులు కిషోర బాలికలు, ఇప్పటి వరకు ఏ సంఘాల్లో లేని మహిళలచే 1350 సంఘాలు ఏర్పాటు చేయించామని చెప్పారు. వారిచే పొదుపు చేయిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, సామాజిక అంశాలపై చైతన్య పరుస్తున్నామని తెలిపారు.

గింజ కోత లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో గింజ కోత లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేశామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం అందుగులపల్లి, దేవునిపల్లి గ్రామాల్లో 28 లక్షలతో పలు అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇష్టానుసారంగా కోతలు విధించి రైతులను నట్టేట ముంచారన్నారు. ఇళ్లు లేని అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లు అధికారంలో ఉండి రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. అందుగులపల్లి రాజీవ్ రహదారి నుంచి దేవునిపల్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ రూ.5 కోట్లు మంజూరు చేసి బీటి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ప్రయాణం, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం, సన్న బియ్యం రైతులకు క్వింటాల్‌కు రూ.500ల బోనస్ అందించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిలబెట్టే అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యదర్శులు గీతావాణి, అఖిల, కాంగ్రెస్ నాయకులు ఆరె సంతోష్, సందనవేని రాజేందర్, బొక్కల సంతోష్, సింగిల్ విండో చైర్మన్, చింతపండు సంపత్, సంతోష్ యాదవ్, గౌస్, స్వప్న-సాగర్, లక్ష్మన్ పాల్గొన్నారు.



అందుగులపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బుధవారం పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డలకు ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ యాకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్ రావు, అర్షనపల్లి వెంకటేశ్వరరావు, నర హరి సుధాకర్ రెడ్డి, రంగు శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డలకు పార్టీ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో 49 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజే శారు. తహసీల్దార్ జక్కని స్వర్ణ, మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్, పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, విం డో చైర్మెన్ వేనుగోపాల్‌రావు, మాజీ సర్పంచ్ దారబో యిన నర్సింహాయదవ్, గిర్దవరి భవాని ప్రసాద్, నాయ కులు జలపతిరెడ్డి, పొట్యాల శంకర్, కొత్త రవిందర్, స్వామి, నర్సింగం, తిరుపతి, మల్లయ్య, పాల్గొన్నారు.

పండుగల నిర్వహణకు నిధులు ఇప్పించండి



ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఎలిగేడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నిర్వహణకు నిధులు ఇప్పించాలని కార్యదర్శులు బుధవారం మండల పంచాయతీ అధికారి బైరికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులు మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా గ్రామాలకు ఎలాంటి నిధులు రాక సొంత డబ్బులను గ్రామపంచాయతీ నిర్వహణకు వెచ్చిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చిన వేతనాన్ని గ్రామపంచాయతీలకు వెచ్చిస్తూ అప్పుల పాలవుతున్నామని వాపోయారు. గ్రామాల్లో బతుకమ్మ దసరా పండుగలకు లైట్లు, ఇతర ఏర్పాట్లు చేసేందుకు నిధులు లేవని, తగినన్ని నిధులు సమకూర్చి పండుగకు ఇబ్బందులు రాకుండా చూడాలని పేర్కొన్నారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సురేష్, హరిబాబు, మహేష్, పున్నమయ్య, శివకుమార్, అంజలి, శిరీష, లలిత, శ్రావణ్‌కుమార్, పాపయ్య, మసోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రవి



పెద్దపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది డొంకెన రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన రవి విద్యార్థి దశలోనే అనేక ఉద్యమాలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎస్‌ఆర్ కళాశాలలో పీజీ చదివి, వైజాగ్ ఆంధ్రా యూనివర్శిటీలో లా చేశారు. పెద్దపల్లి పట్టణంలో నివాసం ఉంటూ న్యాయవాద వృత్తిని చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యావంతుల వేదిక ద్వారా తెలంగాణ జేఏసీలో కీలక పాత్ర పోషించారు. జిల్లాలో ఇటుక బట్టీల్లో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేశారు. రవి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే విజయరమణారావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మన్ కుమార్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపగాని సారయ్య గౌడ్, తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ వేడుకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. బుధవారం సుల్తానాబాద్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. బతుకమ్మలను నిమజ్జనం చేసుకునేలా చెరువు వద్ద సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ ఘాట్ల వద్ద పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు, పండుగ వాతావరణాన్ని ప్రశాంతంగా జరుపుకునేలా చేయిస్తున్నామని వివరించారు. రాజ్ కుమార్, శానిటేషన్ సిబ్బంది శ్రావణ్ కుమార్, రాజ్‌కుమార్ ఉన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లిలో సద్దుల బతుకమ్మ నిమజ్జనం కోసం కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి అరెల్లి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఉండటానికి పలుచోట్ల సొంత డబ్బులతో ఫ్లడ్ లైట్లు ఏర్పాట్లు చేశారు. బతుకమ్మల ఆడుకోవటానికి చెట్లను తొలగించి భూమిని చదును చేసి ప్లాట్ ఫామ్‌లను ఏర్పాటు చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి



ఖనిలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, మంథని కళాశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరుణశ్రీ జ్యోతిప్రజ్వలన చేసి మాట్లా డారు. విద్యార్థులు సామాజిక స్పృహతో ఉన్నతంగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి గుర్తింపు తేవాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.కల్పన మాట్లాడు తూ విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకొని మెలకువలు నేర్చుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినుల నృత్యాలు హోరెత్తించాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి శంకర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్ డే వేడుకలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఉచిత విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలకు చెందిన శ్రీజ అనే విద్యార్థిని జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ స్థానంలో నిలవడం హర్షనీయమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, రిటైర్డు ప్రిన్సిపాల్ అంబరీష్, అధ్యాపకులు ఝాన్సీ, శ్రీధర్‌రావు, తిరుమల్, తిరుపతి, సబిత, శ్రీదేవీ, మౌనిక, సురేష్, దీపారాణి, ఎల్‌ఆర్‌కే రెడ్డిలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):గోదావరిఖని పట్టణంలో పలు స్కానింగ్ సెంటర్లను బుధవారం డీఎంహెచ్‌వో వాణిశ్రీ తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, ఫారం ఎఫ్‌లను పరిశీలించారు. స్కానింగ్ మిషన్ స్టోరేజీ డేటాను రెండు సంవత్సరాల వరకు ఉండాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించనున్నట్టు చెప్పారు. ప్రతి నెల ఫారం ఎఫ్‌లను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఘనంగా చండీహోమం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్జీ-3 పరిధిలోని ఓపెన్‌కాస్ట్-1 ప్రాజెక్టులో చండీహోమాన్ని నిర్వహించారు. జీఎం సుధాకర్‌రావు దంపతులు హోమంలో పాల్గొన్నారు. అర్చకులు చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సామూహిక అనంతరం అన్నదానం నిర్వహించారు. పూజలో మేనేజర్ పాపయ్య, గడ్డం తిరుపతి, మల్లారెడ్డి ఆర్జీ-3, ఓసీపీ-1 అధికారులు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పూసాలలోని భక్త మార్కండేయ ఆలయంలో మూడోరోజు శాకంబరి అవతారంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. భవాని దీక్షాపరులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ వలస నీలయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు వలస భాస్కర్, సుమన్, భవాని, కిషన్ పాల్గొన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు



మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్ద బొంకూర్ మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. తెలంగాణ పూల పండుగను ఘనంగా జరుపుకుంటున్నామని కళాశాల డైరెక్టర్ నవత తెలిపారు. అకౌంట్ ఆఫీసర్ పవన్ కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్‌ఓడిలు వంశీ, సదానందం, శ్రీధర్, జయంత్‌రెడ్డి, సంతోష్, అనిల్, ఆర్షియా, శశి పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తంగేడు, బంతి పూలతో బతుకమ్మలను పేర్చి అధ్యాపకులు, విద్యార్థు లు ఆటాపాటలతో సంబరాలు నిర్వహించారు. ప్రిన్సి పాల్ కోట ఉష, అధ్యాపకులు శ్రీనివాస్, జ్యోతి, మ యూరి, మంజుల, మాధవి, రేణుక, స్మిత, స్వర్ణలత, రజితలు పాల్గొన్నారు.

పార్వతీ బ్యారేజ్‌లో పెరుగుతున్న వరద

మంథనిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిరిపురం సమీపంలోని పార్వతీ (సుందిళ్ల) బ్యారేజ్‌లో బుధవారం సాయంత్రం వరకు భారీగా వరద నీరు పెరిగింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో గేట్లు ఎత్తి నీరు దిగువ ప్రాంతానికి వదలడంతో పార్వతీ బ్యారేజ్‌లోకి 5 లక్షల 98 వేల క్యూసెక్‌ల నీరు వచ్చి చేరింది. అయితే ప్రాజెక్టులో ఉన్న 74 గేట్లు ఎత్తి ఉండటంతో వరద నీరు దిగువకు విడుదల అవుతుంది. రెండు రోజుల క్రితం బ్యారేజ్‌లో వరద నీరు తగ్గుముఖం పట్టగా ఎల్లంపల్లిలో గేట్లు ఎత్తడంతో దిగువకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.

రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హన్మంతునిపేటలో పెద్దపల్లి బాలుర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. గ్రామ ప్రజలకు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యదర్శి అశోక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సదయ్య, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. గౌరెడ్డిపేటలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పిచ్చి మొక్కలు తొలగించారు. నరహరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజలింగం నేత్రాలు సజీవం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కళ్యాణ్‌నగర్‌కు చెందిన కామ రాజలింగం అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా అతని కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన కుమారులు వేణుగోపాల్, అశోక్, విజయ్, రమేష్‌లను అభినందించారు. లయన్స్‌క్లబ్ చైర్మన్ మల్లికార్జున్, రమేష్, జర్నలిస్టులు మాధవరావు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కామ విజయ తండ్రి రాజలింగం మరణించగా విజయ్ కుటుంబాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరామర్శించారు.

బ్లాక్‌స్థాయి పోటీల ముగింపు

రామగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మేరా యువ భారత్, రామగిరి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు బుధవారం ముగిసాయి. గెలుపొందిన క్రీడాకారులకు కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, పెద్దపల్లి ఇన్‌చార్జి మహేష్‌కుమార్, కళాశాల పరిపాలన అధికారి సుమన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, సునీల్, విజయ్‌పాల్, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



ఖనిలో అవగాహన ర్యాలీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. బుధవారం ప్రధాన చౌరస్తాలో మాదక ద్రవ్యాల వినియోగంపై నష్టాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహనకు కలెక్టర్ ప్రచారరథాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. యువత గంజాయి సేవించినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, ఏఎల్‌సీపీఓ రజిత, డీహెచ్‌ఈడబ్ల్యూ అరుణ, ఐసీపీఎస్ శ్రీనివాస్, వన్‌టౌన్ ఎస్ఐ రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

పంటలపై క్షేత్రస్థాయి అవగాహన

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్యా అగ్రికల్చరల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు వ్యవసాయ సాగులో మెలకువలను ఉపాధ్యాయులు సింధూజ బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌లో భాగంగా పది రోజులపాటు వ్యవసాయం, ఎరువులు, మందులు, పిచికారి చేసే విధానం, పురుగు మందుల వాడకం, జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరువులు, మందుల నిర్వాహకులు ఆకుల కిరణ్, తిప్పారపు సాగర్‌లు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హర్షిత్ అన్నారు. బుధవారం అడ్డగుంటపల్లిలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గుండెపోటు వ్యాధులు అధికమయ్యాయన్నారు. అనంతరం 150మందికి ఉచితంగా 2డీ ఎకో, బీపీ, మధుమేహం, ఈసీజీ పరీక్షలను నిర్వహించారు. వైద్య శిబిరంలో ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి రమేష్, రవి, రమేష్, బొంగోని హరీష్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

పంటల వివరాల ప్రకారమే ధాన్యం కొనుగోలు

ఎలిగేడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పంట వివరాల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారి మేరుగు ఉమాపతి అన్నారు. బుధవారం నర్సాపూర్‌లో విస్తరణ అధికారులతో కలిసి పంటల సర్వే చేపట్టారు. ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని 12 గ్రామాల పరిధిలో నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకుండా సాగు చేస్తే ఆ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. గణేష్, సురేష్, శరణ్య, రైతులు ఉన్నారు.

ఆసుపత్రి స్థాయి తగ్గించిన ఘనత బీఆర్‌ఎస్‌దే

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని ఆరు పడకలకు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజన వేన సదయ్య విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధి విషయమై మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఎమ్మెల్యే విజయరమణరావు దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. త్వరలోనే ఈ ఆసుపత్రి 30 పడకలతోపాటు మరో కొత్త భవనం కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే 18 నెలలుగా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు సబ్బని రాజమల్లు, శివరామకృష్ణ, మాదాసు సతీష్, బాలే శివ ప్రసాద్, బంగారు రమేష్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న గాయత్రి విద్యాసంస్థల చైర్మన్, సాయినాథ్‌ను అభినందిస్తున్న ఎంఈవో సురేంద్రకుమార్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబ రు24(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థిని సింధు సత్తా చాటారు. ఈ నెల 25 నుండి 28 వరకు నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విద్యార్థిని అభినందించారు. కరస్పాండెంట్ అల్లంకి రజనీదేవి, ప్రిన్సిపాల్ విజయ్, పీఈటీలు అజయ్ కుమార్, మంజుల పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.సాయినాథ్ నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం తెలిపారు. విద్యార్థి సాయినాథ్‌ను ఎంఈవో సురేంద్రకుమార్ మెమోంటో అందించి అభినందించారు. నిజామాబాద్‌లో జరిగే పోటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పీడీ సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు నిధులు సమకూరుస్తా

సుల్తానాబాద్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి):దుబ్బపల్లి, గర్రెపల్లి గ్రామాలలో నిర్మిస్తున్న పలు ఆలయాల నిర్మాణాలకు నిధులను సమకూర్చుతానని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్‌గౌడ్ అన్నారు. దుబ్బపల్లిలో భక్తాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. గ్రానైట్ పనులకు దాతల సహకారంతో నిధులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. గర్రెపల్లిలో శివుని విగ్రహ నిర్మాణ పనులను సందర్శించి రూ.20 వేలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ శిబిరాన్ని ప్రారంభించారు. 102 మంది విద్యార్థులు రక్తదానం చేయగా వారికి సర్టిఫికేట్‌లను అందజేశారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్‌రెడ్డి, డిస్పెన్సరీ ఇంచార్జి రమేశ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో హాకథాన్ బ్రోచర్ ఆవిష్కరణ

సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, కేంద్ర ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు స్మార్ట్ ఇండియా హాకథాన్ నిర్వహిస్తున్నారు. బుధవారం జేఎన్టీయూలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 25న కళాశాలలో హకథాన్ జరుగుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, కో-ఆర్డినేటర్ నరహరి, పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి, పిడి కృష్ణారెడ్డి, ఆర్గనైజర్స్ వంశీ కృష్ణ, సాయిదీక్షిత్, శివకృష్ణ, రవికాంత్, దేవేంద్రచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కోల్‌సిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మమత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకుడు మహంకాళి స్వామి తండ్రి దుర్గయ్యను బుధవారం రాత్రి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పరామర్శించారు. దుర్గయ్య మోకాలుకు శస్త్ర చికిత్స జరుగగా ఆసుపత్రిలో కలిసి ధైర్యం చెప్పారు.

ర్యాగ్ పిక్కర్లకు సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ర్యాగ్ పిక్కర్లు

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికి చెత్త సేకరణ చేసే కార్మికులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించి వారికి సౌకర్యాలు కల్పించాలని బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్ వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 20 సంవత్సరాలుగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్న కార్మికులు ర్యాగ్ పిక్కర్లుగా విధులు నిర్వహిస్తున్నారని, నామమాత్రంగా వేతనాలతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో, అధికారులతో మాట్లాడి ర్యాగ్ పిక్కర్లను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించి వేతనాలు పెంచాలని, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ర్యాగ్ పిక్కర్ కార్మికులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందుతున్న జీఎంకు సన్మానం

రామగిరి,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వర్క్‌షాప్స్ ఎనర్జీ మేనేజ్మెంట్ విభాగం జీఎం జేసురత్నం పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా బుధవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో సన్మానించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, శేఖర్‌బాబు, యాదయ్య, నారయణ, బండి సత్యనారయణ, వెంకటరమణ, ప్రవీణ్, ఫాటింగ్, రాజారెడ్డి, షబ్బీరుద్దీన్, రాజేశ్వరి, మేఘన, మనోజ్ పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం కార్పొరేట్ వర్క్‌షాప్స్ ఎనర్జి మేనేజ్‌మెంట్ జీఎం ఫిట్స్ జేసురత్నం పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో జీఎం లలిత్ కుమార్ సన్మానించారు. ఏజీఎం(ఐఈడీ) ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రాంమోహన్‌రావు, డీజీఎం (వర్క్‌షాప్) జితేందర్ సింగ్, సీఎంఓఐఏ ప్రతినిధి కోలా మల్లేష్, అధికారులు లక్ష్మీరాజు, రాందాస్ భీమా, వేణు పాల్గొన్నారు.

ఫ్యామిలీడే పురస్కరించుకుని క్విజ్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఈఆర్ క్లబ్ ఫ్యామిలీడే నిర్వహించనున్నట్లు ఆర్జీ-2 అధికార ప్రతినిధి అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యామిలీ డే పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. 27 తేదీ ఉదయం 10 గంటలకు సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో విద్యార్థుల నుంచి ఐదుగురు విద్యార్థులతో కూడిన బృందం పాల్గొనాలని అరవిందరావు సూచించారు.

సింగరేణి పాఠశాలను సందర్శించిన జీఎం సెక్రెటరీ

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి పాఠశాలను ఎడ్యుకేషన్ సెక్రెటరీ వెంకటాచారి బుధవారం సందర్శించారు. సిబ్బంది వివరాలు తెలుసుకుని వసతులను పరిశీలించారు. సీబీఎస్‌ఈ సెలబస్‌ను సింగరేణిలో మొదటిసారి సెక్టార్-3 పాఠశాలలో ప్రవేశపెట్టామని, పాఠశాల పేరు నిలిపేలా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయ బృందానికి వెంకటాచారి సూచించారు. 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వ హించడం, వెనక బడిన విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. హెచ్‌ఎం సుందర్‌రావు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు 15శాతం లాభాల వాటా ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో 15 శాతం వాటా ఇవ్వాలని బుధవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్జీ-2 పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంస్థ పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సమష్టి కృషితో గణనీయమైన లాభాలు వచ్చాయని యూనియన్ ఉపాధ్యక్షుడు అశోక్ తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో 15 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. బుచ్చమ్మ, సదానందం, భవాని ఉన్నారు.

బదిలీ వర్కర్లు జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

గోదావరిఖని, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో బదిలీ వర్కర్లుగా చేరి గనులు, ఓపెన్ కాస్టులు, సర్ఫేస్‌లలో పనిచేస్తూ 190/240 మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరించేందుకు సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 డిసెంబర్ 31, అంతకు ముందు సంవత్సరకాలం సర్వీసు చేసిన వారిని భూగర్భ గనుల్లో అయితే 190మస్టర్లు, ఓపెన్‌కాస్ట్ గనుల్లో, సర్ఫేస్ లో అయితే 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరించింది. ఈ విషయమై సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రులతో గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జరిపిన చర్చల అనంతరం యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. జనరల్ మేనేజర్ (పర్స నల్) , ఐఆర్‌పీఎం అన్ని ఏరియాలకు ఒక సర్క్యులర్ జారీ చేశారు.

ఏరియాల వారీగా...

రామగుండం-2 ఏరియాలో 303మంది బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరించారు. భూపాలపల్లి ఏరియాలో 250 మంది, శ్రీరాంపూర్‌లో 241, రామగుండం-3, అడ్రియాల ఏరియాలలో 167మంది, రామగుండం-1లో 156మంది, మందమర్రిలో 64మంది, కార్పొరేట్‌లో 21మందికి, కొత్తగూడెం ఏరియాలో 20మంది, మణుగూరు ఏరియాలో 19మంది, బెల్లంపల్లి ఏరియాలో 11మంది, ఇల్లందు ఏరియాలో ఆరుగురికి జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1గా క్రమబద్ధీకరించారు.